# సినీమాయ

-నందచైతన్య

"నువ్విలాంటి వేషాలేస్తే నీ దగ్గరకు చేరనంతే'' హీరోయిన్ పాత్రధారిణి చెప్పింది వయ్యారాలుపోతూ...

"కట్'' అసహనంగా చెప్పాడు శంతన్...ఆ పిక్చర్ డైరెక్టర్.

"ఇదిగో అసిస్టెంట్ డైరెక్టరూ'' గట్టిగా పిల్చాడు డైరెక్టర్.

"ఆ బోంబే పిల్లకు చెప్పు డైలాగ్ ఎలా చెప్పాలో. మనం తీసేది యూత్ సిన్మా. ముసలమ్మల సిన్మా కాదు. మోడలింగ్ చేస్తోంది గదా కాస్త ఒడ్డూ, పొడుగూ బానే ఉంది. మనం ఎలా చెప్తే అలా నడుచుకొంటోంది. ఒళ్లు దాచుకోకుండా పనిచేస్తుంది అంటే నిజమని నమ్మడం నాదే బుద్ధి తక్కువ''

"ఏమి అయ్యింది. నాదీ తప్పు ఐ మీన్ ఫాల్ట్ - ఎనీ థింగ్ ఈజ్ దేర్'' వచ్చీరాని తెలుగును ఇంగ్లీషుతో మిక్స్ చేసి డైరెక్టర్ దగ్గరకొచ్చింది హీరోయిన్.

పళ్లికిలిస్తూ నవ్వాడు అసిస్టెంట్.

"ఎందుకూ వాడు నవ్వుతుంది. దానికి మతి లేదా...అమ్మో, నాకూ టెల్గూ బాగా వచ్చాడు''

డైరక్టరుకు కోపం నషాళానికంటింది.


"దాన్ని కాస్త అవతలకు పొమ్మని చెప్పవయ్యా'' చిరాగ్గా అరిచాడు.

"ఇదుగో, ఇందాక డైలాగు హిందీలో బాగా రాసిచ్చావా. లిప్ మూవ్‌మెంట్ సరిగ్గా లేదు.

అది సరిచేసుకోమను ముందు. తర్వాత మొహంలో ఎక్స్‌ప్రెషన్స్ రావాలి. అబ్బాయికి అమ్మాయి అందినట్టే అంది జారిపోతున్నట్టుగా చెయ్యాలి''

తన మాటలు వింటున్నాడా? లేదా? అని అసిస్టెంటు వైపు చూసి తిరిగి చెప్పసాగాడు శంతన్.

"ఈ సీనుతోనేనయ్యా కుర్రాళ్లు టెంప్ట్ అయిపోవాలి. హాలు గోలెత్తిపోవాలి. అమ్మాయిలూ, అబ్బాయిలూ కాలేజీలు ఎగ్గొట్టి సిన్మా హాళ్ల చుట్టూ తిరగాలి'' చాలా ఎమోషనల్‌గా చెప్పాడు శంతన్.



అసిస్టెంట్ గంగిరెద్దులా తలూపాడు.

"మన ముందు సిన్మాకి చూశావా రెషస్ ఎలా వున్నాయో...ఇదీ అలా హిట్టవ్వాలని జనం అంతా మన 'ముద్దంటే చేదా?' సిన్మా కోసం ఎదురుచూస్తున్నారు.

ఇది హిట్టయితే మనం ఫీల్డులో సెటిలయిపోవటం ఖాయం.''

అసిస్టెంట్ వెళ్లిపోయాడు.

★★★

'ముద్దంటే చేదా?' ఆడియో రిలీజయ్యింది.

టీవీలో యాడ్స్ గోల.

అందరు సినీ ప్రముఖుల కామెంట్లు.

రోడ్లమీద ఆడియోలు అరుస్తున్నాయి...'అనగ నగ రాగ మతిశయిల్లుచునుండు' అదే పాటను పదే పదే...పదే పదే ఏమిటి రోజుకు ఇరవై ముప్పై సార్లు ప్రైవేట్ ఛానల్స్‌లో చూపించేసరికి ప్రజల మీద ఆ పాటలు ప్రభావం చూపించాయి.

ఆడియో సూపర్‌హిట్.

సిన్మా రిలీజైంది.

తాము చదివే కాలేజీలో తప్ప మరెక్కడైనా గంటల తరబడి ఓపిగ్గా ఉండిపోగల 'యువజనం' సినిమాను సూపర్‌హిట్ చేశారు...జంటలు జంటలుగా వెళ్లి... గంటలు గంటలు క్యూలో నిలబడి...వంతుల వారీగా ఐదుసార్లు, పదిసార్లూ చూసేసి.

***

"అదిరించేసావయ్యా శంతన్...వరసగా రెండో హిట్టు".

ఇండస్ట్రీలో పేరున్న అతి పెద్ద డైరెక్టరు అలా అనటంతో శంతన్ ఉబ్బితబ్బిబ్బైపోయాడు.

"కుర్రాళ్లు వెర్రెత్తిపోతారు. అమ్మాయిలు అర్థంటుగా బాయ్‌ఫ్రెండ్స్‌ని వెతికేసుకొంటారు. అమ్మాయికి ఆపోజిట్ సెక్స్‌తో స్నేహం ఎంత అవసరమో అమోఘంగా చెప్పావ్"

"...."

శంతన్ మౌనంగా కూర్చున్నాడు. అతని మనసు ఆనందంతో పొంగిపోతోంది.

"అమ్మాయి అబ్బాయి కలిసి తిరగటం తప్పు కాదు అని కథ ద్వారా బలంగా చెప్పటం వల్ల ఎవరూ విమర్శించలేరు.

మొత్తానికి పబ్లిక్ నాడి బాగా పట్టేశావు. మా రోజుల్లో అయితే చక్కగా ఆడవాళ్లని థియేటర్లకు రప్పించేలా సినిమాను ప్లేన్ చేసి తీసేవాళ్లం" కాసేపు ఆగాడు పెద్ద డైరక్టరు. శంతన్ తల ఊపుతూ చిరునవ్వు నవ్వుతూ పెద్దాయనకు వైన్ గ్లాసందించాడు.

ఓసారి సిప్ చేసి మొదలుపెట్టాడు పెద్ద డైరక్టరు. "ఈ రోజుల్లో ఆడవాళ్లు టీవీ సీరియల్స్‌కి అతుక్కుపోయి సినిమాలకు రావటమే మానేశారు. ఇక బయట తిరిగే అవకాశం ఉన్నది కాలేజీలకు వెళ్లే పిల్లలకే. ఆ పిల్లలకు నచ్చే పాయింట్లు పెట్టి..." మళ్లా ఓ గుక్క తాగి-

"లెక్చరర్‌లని ఏడిపించటం, తల్లిదండ్రుల్ని తిట్టుకోవటం...క్లాసులెగ్గొట్టి నచ్చిన అమ్మాయి కోసం తిరగటం... ఇదంతా ఓ ఎత్తయితే... ఆ హీరోయిన్ డ్రెస్సులూ, ఆ సాంగ్సు... ఆ నడుంవూపులకి అబ్బో ఇంత అనుభవం ఉన్న నాకే ఇంత వయసొచ్చి అదోలాటి జివ్వు పుట్టేసిందనుకో."


"మీరు నన్ను మరీ పొగిడేస్తున్నారు"

"నీ టాలెంట్... పబ్లిక్ వీక్‌నెస్ కనిపెట్టి ఆ బలహీనత మీద ఆడుకున్నావు చూడూ" అతను మత్తుగా ఏదో మాట్లాడుతూనే ఉన్నాడు.

తెలివైన వాడు తెలివి తక్కువ వాణ్ని దోచుకోవటమేగా బిజినెస్సంటే...

సినిమా కోట్లాది జనాన్ని వినియోగదారులుగా కలిగిన పెద్ద బిజినెస్సు.

***



శంతన్ తన విజయానందాన్ని అనుభవిస్తున్న ఆ సమయంలో సెల్‌ఫోన్ మ్రోగింది.

కాల్ ఎక్కణ్నించి వస్తుందో చూపాడు.. ఇంటి దగ్గర్నుంచి.

"హలో" అన్నాడు.

"నేన్రా" అవతల్నుంచి తల్లి.

"ఏమిటి మమ్మీ" కాసింత చిరాకు అతని కంఠంలో తొంగిచూసింది.

తల్లి ఏమీ మాట్లాడలేదు.

ఆవిడ ఫోన్లో ఏడుస్తోంది.

"ఏమైందమ్మా"

లోగొంతుకతో కాసింత కంగారుగా అడిగాడు.

అవతల్నుంచి ఆమె చెపుతోంది.

అతని దవడ కండరాలు బిగుసుకొంటున్నాయి.

"నేను బయల్దేరి వస్తున్నాను" అంటూ ఫోన్ ఆఫ్ చేసి గబగబా డ్రెస్ సర్దుకొని పెద్ద డైరెక్టరుగారికి 'సారీ' చెప్పేసి బ్రీఫ్ కేసు తీస్కుని బయల్దేరాడు శంతన్.

***

ఇంట్లోకి అడుగుపెడుతూనే-

"ఎక్కడ ఉంది అది?" అడిగాడు శంతన్ తల్లిని.

మేడపైన అన్నట్టుగా వేలు చూపించి ఎగదన్నుకు వస్తోన్న దుఃఖాన్ని ఆపుకుంటూ నోటిలో కొంగు కుక్కుకొంది ఆ తల్లి.



## నమ్మకం

నమ్మకం ఉంటే జీవితంలో ఎన్ని ఒడిదుడుకులనైనా అవలీలగా ఎదుర్కోవచ్చు. విపత్కరమైన పరిస్థితులెదురైనప్పుడు దేవుడిని ప్రార్థించి స్వాంతన పొందుతారు జనం. దీనికి తారలేం మినహాయింపేం కాదు. శిల్పాషెట్టి ప్రతి ఏడాదీ తిరుపతి వెళ్ళి ఆ తిరుమలేశుని దర్శించుకోవడం ఆనవాయితీగా జరుగుతోంది. ఈమధ్య అసలే సమస్యలు మధ్య చిక్కుకుని ఉక్కిరిబిక్కిరి అవుతోన్న శిల్పా తిరుపతి వెళ్ళొచ్చింది. 'నాకు దైవభక్తి మీద నమ్మకం ఉంది. దేవుడంటే నాకెంతో ప్రేమ' అంటోంది. అందుకేనేమో 'దిక్కుల్లో మొదటిది తూర్పు దిక్కు... దిక్కులేనివాళ్ళకు దేవుడే దిక్కు' అని ఎవరో సినీకవి రాశాడు. ఆ పాటలో ఎంత అర్థం ఉందో శిల్పాకి అర్థమవుతోంది.




గబగబా మేడమెట్లవైపు కదిలాడు శంతన్.

"కోపంతో దాన్ని కొట్టొద్దు" వస్తున్న ఏడుపును ఆపుకొంటూ అంది ఆమె.

"కొట్టడమా, చంపటమా?" కోపంతో అతని గొంతు మ్రోగింది.

తల్లివైపు చూసి నెమ్మదిస్తూ -

"ఇంతకీ ఎవడా స్కౌండ్రల్?" అడిగాడు శంతన్.

"నీ ఫ్రెండ్ రాజు లేడూ. అతని తమ్ముడు రాకేషట."

"ముందు దానితో మాట్లాడి...తర్వాత వాడి సంగతి చూస్తాను" గబగబా చెల్లెలి గదివైపు కదిలాడు.

ఏడ్చి ఏడ్చి నిద్రపోయింది శ్రావ్య... శంతన్ చెల్లెలు.

"శ్రావ్యా...శ్రావ్యా"

గదిలోకి అడుగుపెడుతూనే చెల్లిని తట్టి పిలిచాడు.

ఉలిక్కిపడి లేచింది శ్రావ్య. కళ్లు తెరుస్తూనే ఎదురుగా అన్నయ్యను చూసి మరింత ఉలిక్కిపడింది.

గదిలోకి వస్తున్న తల్లి ఆకారాన్ని చూసి అన్నయ్యకు విషయం తెలిసిపోయిందని ఆమెకు అర్థమైపోయింది.

"అన్నయ్యా" అంటూ అన్న శంతన్ కాళ్లకు అల్లుకుపోయింది శ్రావ్య.

ఎడాపెడా చెల్లిని నాలుగు కొట్టి బుద్ధి చెప్పాలనుకున్న శంతన్ ఆవేశం పూర్తిగా చల్లారిపోయింది.

అతను...రెండు హిట్ సిన్మాలందించిన గొప్ప యువ దర్శక స్థాయి నుండి మామూలు అన్నయ్య స్థాయికి వచ్చేశాడు.

"అసలెందుకు చేశావే ఇలాంటి పని, కాలేజీకి వెళ్లి బుద్ధిగా చదువుకోక?" అన్నాడు శంతన్.

"....."

మౌనంగా తలొంచుకొని ఏడవసాగింది శ్రావ్య.

"దీని వయసెంత?

నిండా పదహారేళ్లు లేవు. అపుడే ఇది ...ఛీ...ఛీ" అంటోంది తల్లి.

"ఛీ...ఛీ...అంటే లాభం ఏమిటమ్మా? అది కాలేజీకి ఎలా వెళ్తోంది? ఎలా వస్తోంది? ఎన్నింటికి వస్తోంది? ఇవేమీ నువ్వు..." తల్లిని గదమాయిస్తూ ఆగిపోయాడు శంతన్.

ఆవిడ మాత్రం ఏం చేస్తుంది? తండ్రి చనిపోయినప్పట్నించి ఆస్తిని సంరక్షించుకొంటూ...తనను చదివించి, సిన్మా ఫీల్డుకెళ్తానంటే ప్రోత్సహించి...

"అది ఎక్స్‌ట్రా క్లాసులంటూ... స్నేహితురాలింటికి నోట్సు కోసమంటూ వెళ్తూ ఉండేది.

రాత్రుళ్లు లేటుగా వస్తే... ఎక్కడికి వెళ్లావే అంటే... ఫ్రెండ్‌తో కంబైన్డ్ స్టడీస్ అనేది."

"అసలు దీన్ని కాదు. వాణ్ణనాలి. వాణ్ణి...ఆ రాస్కెల్‌ని"

"అన్నయ్యా...నన్నేమన్నా అంటే అను... లేకుంటే నన్ను కొట్టు, తిట్టు... అతన్నేమన్నా నేను భరించలేను"

ఆ శ్రావ్య అనబడే పదహారేళ్లమ్మాయి ప్రియుడి కోసం పరితపిస్తూ అన్నయ్యను ఎదిరిస్తూ అంది.

"నోర్మూయ్" గట్టిగా అరిచాడు శంతన్.

"ఈ వయసులో నీకు ప్రేమేమిటే. అది ఆకర్షణ..."

ఇంకేమనాలో తోచక తలపట్టుకున్నాడు శంతన్... యువ హృదయాలను రంజింపజేసే ఆ యువకిశోరం.

***

"ఇపుడేం చేద్దామంటావ్?" విషయమంతా చెప్పి శంతన్ వీలైనంత కూల్‌గా అడిగాడు రాజును.

"ఏం చేస్తాం. ఇద్దరికీ పెళ్లి చేసేద్దాం" అన్నాడు రాజు.

"ఈ వయసులోనా?" ఆశ్చర్యంగా అడిగాడు శంతన్.

"యెస్. తప్పేంవుంది. నువ్వు నీ సిన్మాల్లో చెప్పింది అదేగా"

"....."

శంతన్ మౌనంగా ఉండిపోయాడు.

"కానీ...కట్నం మాత్రం"

"కట్నమా...వాళ్లు 'లవ్' చేసుకున్నారు"

"నిజమే...కానీ ఫార్మాలిటీలు మామూలే. లవ్ చేసుకుని కట్నాల్లేకుండా పెళ్లిళ్లు చేసుకుని నానా యాతనలూ పడి సంసారం ఈది గొప్ప ఆదర్శ దంపతులవ్వటానికి ఇది సిన్మా కాదు జీవితం... అహా, పోనీ ఇలాంటి కథ సినిమాగా తీయటానికైనా పనికొస్తుందా, నువ్వే చెప్పు..."

శంతన్ అన్నిటికీ ఒప్పుకొని శ్రావ్య పెళ్లి జరిపించాడు.

తరువాత అతనెపుడూ అలాంటి సినిమాలు తీయలేదు.

★